

# పసిడిమనసులు

## - షర్మిల



### కాలేజీ స్టైలే ...!

పదో తరగతి పాసయ్యేటప్పుడికి నాకు 15 ఏళ్ళు. 15 ఏట అడుగు పెట్టిన ఏడాదే ఇంటర్లో చేరాను. రికార్డుల్లో ఒకేడాది తగ్గించి బళ్ళో ఏశారు .

చిన్నప్పుడు మా ఊళ్ళో అందరూ బడికి ఎల్తాంటే నేనూ ఎల్లాల్సిందే అని పట్టుబట్టాను. అప్పటికి నాకు రెండేళ్ళు నిండాయి. మాటలు ఏడాది కల్లా వస్తే సుమతీ శతకం పద్యాలు ఏడాదిన్నరకల్లా అప్పజెప్పేదాన్నంట.

ఇదంతా ఎవరి ట్రైనింగో చెప్పక్కర్లేదు.

ఇంకెవరు ? మా నాయనమ్మ చిట్టెమ్మదే.

రోజూ రాత్రుళ్ళు ఆరు బయట మంచం మీద పడుకుని ఆకాశమంతా చిక్కగా పరుచుకున్న నక్షత్రాల్ని చూసుకుంటూ చిట్టెమ్మ చెప్పినియ్యన్నీ వినేదాన్ని.

మర్నాడు ఎవరి ముందు ఆ పద్యం చెప్పమంటే ఆ పద్యం చెప్పేస్తే అందరూ ఆశ్చర్యపోయేవారు.

బళ్ళో చేరక ముందే నా కన్నా పెద్ద పిల్లలు చదివేయ్యన్నీ వినొచ్చి ఇంట్లో గడగడ చెప్పేదాన్ని. ఇదంతా చూసి ఇంట్లో వాళ్ళు భవిష్యత్తులో పేద్ద మేధావినై ఏదో చేసేస్తామనుకున్నారు.

కానీ బాలమేధావిగానే వుండిపోయాను. కానీ ఆ తరవాత బాక్ బెంచ్ స్టూడెంట్ గా గొప్ప పేరు తెచ్చుకున్నాను .

కాకపోతే టెన్త్ క్లాస్ లో ఎట్టాగో సుమారుగా ఫస్ట్ క్లాస్ తెచ్చుకున్నా . మళ్ళీ ఈ సుమారేంటి అని అంటారా.

లెక్కల్లో 37 మార్కులు మిగతాయ్యన్నీ ఫస్ట్ క్లాస్ మార్కులే ...

అందుకే టోటల్ ఆ మాత్రం కూసింత తగ్గదా ఏంటి ? ఇక కాలేజ్ స్టూడెంట్నయ్యాను.

కొత్తగా రెక్కలొచ్చినట్టుంది. అసలు టీనేజ్ కి వచ్చిన దగ్గర్నుంచే సోకులు మొదలైనియ్ .

9 వ తరగతి నుంచి మద్రిపాలెంలో 104 ఏరియాలో నిద్ర గన్నేరు చెట్టు కింద బడ్డీ లో టైలరుకి మా అమ్మ చదివే హిందీ మాగ్ జైన్లు, ఫిలింఫేర్ లు తీసికెల్లి డిజైన్లు చూపించి కుట్టమనేదాన్ని.

డార్క్ సీ గ్రీన్ బెల్ బోటమ్ పాంట్ అదే రంగు కోటు అంటే సఫారీ డ్రెస్ టైపు కుట్టించా. మా వాడు బొంబాయి టైలర్లని మించి మాక్సీలు, సూట్లు కుట్టేవాడు .మాక్సీలు అంటే ఈ రోజుల్లోలాంగ్ ఫ్రాక్ అనొచ్చు.

వైజాగ్ శివారుల్లో మా నాన్న బ్రిక్ ఫ్యాక్టరీ పెట్టడంతో ఇల్లు మారిపోయాం .

దాంతో నన్ను దగ్గరలో వున్న ఓ జూనియర్ కాలేజీలో చేర్చారు .

ఇక కాలేజీలో చేరినాక మా మ(రిపాలెం టైలరు కుట్టిన మ్యాక్సీ ఏసుకుని కాలేజీలోకి అడుగుపెట్టానో లేదో " అడవి రాముడు " సినిమా టిక్కట్లకి తోసుకున్నట్టు ఆ కాలేజీ పిల్లలు అందరూ నన్ను చూడటానికి విరగబడ్డారు.

అప్పటి వరకూ గర్ల్స్ హైస్కూల్లో చదివిన నాకు కో ఎడ్యుకేషన్ కాలేజీ అలవాటు లేదు.

అదీ ఊరి బయట వున్న పల్లెటూరి కాలేజీ కి జీనత్ అమన్ టైపు డ్రస్ ఏసుకెళ్తే ఎంత రచ్చ అవుతుందో ఊహించలేదు. పైగా నాకు సిగ్గు పడటం బొత్తిగా అలవాటు లేదు .

అప్పటివరకూ అక్కడి స్టుడెంట్స్ గుండెలకి పుస్తకాలు అనించుకుని వెళ్ళే ఆడపిల్లలనే చూశారు.

వాళ్ళ పిల్లి కూతల్ని , కిచకిచలని విని వాళ్ళ కళ్ళల్లోకి సూటిగా చూసి " ఏంటి ఎదవ్వేషాలా ?" అనడిగే నన్ను చూసి ఏం చెయ్యాలో వాళ్ళకి అర్థం కాలేదు.

కాకపోతే వాళ్ళల్లో చాలా మంది నా ఆరాధకులుగా మారిపోయారు.

నేను కాలేజీ యూనియన్ ఎలక్షన్లలో స్టూడెంట్ యూనియన్ సెక్రెటరీగా 80 ఓట్ల మెజారిటీతో గెలిచాను.

అప్పటివరకూ ఆడపిల్లలు లేడీస్ రిప్రజెంటేటివ్ లు గా తప్ప కాలేజీ సెక్రటరీగా ఎవరూ పోటీ చేసే సాహసం చెయ్యలేదు .

ఇలా ఒక ఆడపిల్ల కాలేజీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం విశాఖ జిల్లాలోనే మొదటి సారేమో.

కాకపోతే ఆ ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థులు నా మీద అవాకులు చవాకులు గోడల మీద రాశారు. అది చూసి నేను ఏడుపు మొదలెట్టి విత్ డ్రా అయిపోదామనుకున్నా .

కానీ నా స్నేహితులు సురేష్ , సత్యనారాయణలు

" ఇలాంటి వాటికి భయపడే దానివి ఎందుకు పోటీలో దిగావు "! అని తిట్టారు .

కాలేజీలో నా గెలుపు వార్త వచ్చిన గంటలో గోడలన్నీ వైట్ వాష్ చేయించారు మా ప్రిన్సిపాల్ రమాదేవి.

ఆ తరవాత ఎన్నేళ్ళకో మా ప్రిన్సిపాల్ రమాదేవి సిటీ బస్ లో కనిపించారు .

అప్పుడు నేను నా పిల్లకి ఆమెని చూపించాను .

అప్పుడు ఆమె

" నీలాంటి ఆడపిల్ల కోసం ప్రతి ఏటా ఎదురు చూస్తాను.

నీ కన్నా మోడ్రన్ డ్రస్ లు వేసుకొస్తున్నారు... కానీ నీలా మోడ్రన్ గా ఆలోచించే పిల్ల ఇంకా రాలేదు !" అన్నారు .

ఆనాడు నా గెలుపు కోసమే ఆమె వేచి వుండి, నేను గెలవగానే నా మీద పడిన మరకల్ని తుడిపించారని తెలిసినప్పుడు నాకు ఐఏఎస్ పాసయినంత ఆనందం కలిగింది.

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments